
# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 109 వ భాగం

## పురంజనోపాఖ్యానం; పృధు చరిత్ర - 2

వేనుడు పోయాక ఆయన శరీరాన్ని మధించేసరికి పృధువు పుట్టుకొచ్చాడు. పృధువుకి రాజ్యం కట్టబెట్టారు కదా. రాజ్యం ఇచ్చాక ఆయనకి పెద్ద కష్టం ఉంది ఎదురుగా. నువ్వింతవాడివి అంతవాడివి అంటూ పొగడటం మొదలుపెట్టారు వంధిమాగదులు. అప్పుడు రాజు అంటున్నాడు వీళ్లతో.

క. అతి విశ్రుతులు సులజ్జా
న్వితులు మహోదారు లధిక నిర్మలు లాత్మ
స్తుతి పరనిందలు దోషము
లతి హేయము లని తలంతు రాత్మల నెపుడున్. [4-447]

క. వంది జనంబులు లోకము
లందు నవిదిత వరకర్ము లగు భూపతులన్
నందించు టవశ్యంబై
నం దగదు నుతింప శిశుజనంబుల పగిదిన్. [4-448]

నేను రాజుని కనక ఇలా స్తోత్రాలు చేస్తున్నారు కాని మరీ పసిపిల్లలు చేసినట్టూ (శిసుజనంబుల పగిదిన్) చేయడం మంచిది కాదు. ఆత్మ స్తుతీ పరనిందా దోషమే.

వ. అమృతోపమానంబు లయిన మధుర వాక్యంబుల నిట్లనిరి. [4-450]

క. వేనాంగ సంభవుండవు
శ్రీనాథ కళాంశజుఁడవు చిరతరగుణ స
మ్మానార్హుండ వతర్కిత
మైన భవన్మహిమఁ బొగడ నలవియె మాకున్. [4-451]

వీళ్లేమంటున్నారంటే, కాదు కాదు నువ్వు నారాయణాంశతో పుట్టావు వేనుడి శరీరంలోంచి. అదీగాక నువ్వు పుట్టాక బ్రహ్మతో మొదలు అందరూ నీకు ఏదో ఒకటి ఇచ్చారు. అందువల్ల నువ్వు కారణ జన్ముడవి.

సీ. ఈ వైన్యుఁ డఖిలలోకావళి ధర్మాను
వర్తనముల నెప్డు వఱలఁ జేసి
ఘనధర్మమార్గ వర్తనులలో ధన్యుఁడై-
ధర్మ సేతువుఁ బ్రీతిఁ దగిలి ప్రోచు;
ధర్మ శాత్రవులను దండించు నష్ట ది-
క్పాలకమూర్తి సంకలితుఁ డగుచు;
నయ్యయి కాలంబులందు భాషణదాన-
ములఁ బ్రజారంజనములఁ దనర్చు; [4-454]

తే. సవన సద్వృష్టి కరణాదిసక్తుఁ డగుట
నుభయలోకంబులకుఁ బ్రీతి నొదవఁ జేయు;
న్యాయమార్గంబునను భూజనాళి ధనముఁ
బుచ్చుకొను నిచ్చు సూర్యుఁడుఁ బోలె నితఁడు.

మాకు తెలిసిన విషయాల ప్రకారం ఇంకా ఉంది - ఈ పృథు చక్రవర్తి (వైన్యుడు — వేనుడి వంశంలో పుట్టినవాడు) లోకాలను ధర్మమార్గంలో నడిపిస్తాడు. ధర్మ విరోధులను శిక్షిస్తాడు. అష్ట దిక్పాలకుల స్వరూపం ధరించి ఆయా కాలాలలో మంచి మాటలతోను, దానాలతోను ప్రజలను సంతోష పెట్టగలడు. ఈయన చేసే యజ్ఞాలకు సంతుష్టులై

దేవతలు వర్షాలు కురిపిస్తారు. సూర్యుడు భూమిమీద జలాలను పీల్చి మేఘంగా మార్చి వాన కురిపించే విధంగా ఈయన న్యాయమార్గంలో ప్రజల నుండి పన్నులు పుచ్చుకొని కావాల్సినప్పుడు ఆ ధనాన్ని మళ్ళీ వారికే ఇస్తాడు. గమనించారా? ప్రజలనుండి తీసుకునే పన్నులు వాళ్లకే ఇవ్వాలి. స్వంతానికి వాడుకోకూడదు.

వ. అని వెండియుఁ; "ప్రవేశ నిర్గమ శూన్యమార్గ నిరూఢ కార్యుండును, నపరిమిత మహత్త్వాది గుణగణైక ధాముండును, సముద్రునిభంగి గంభీర చిత్తుండును, సుగుప్తవిత్తుండును, వరుణుండునుబోలె సంవృతాత్ముండును, శాత్రవాసహ్య ప్రతాప యుక్తుండును, దురాసదుండును, సమీపవర్తియయ్యును దూరస్థునిభంగి వర్తించుచు వేనారణిజనిత హుతాశనుండు గావున హుతాశను చందంబున నన్యదుస్స్పర్శనుండును నై, చారులవలన సకలప్రాణి బాహ్యాభ్యంతర కర్మంబులం దెలియుచు, దేహధారులకు నాత్మభూతుండై సూత్రాత్మకుండైన వాయువు భంగి వర్తించుచు, నాత్మస్తుతి నిందలవలన నుదాసీనుం డగుచు, ధర్మపథంబున వర్తించుచు, నాత్మీయ సుహృద్బంధువుల వలనం దప్పు గలిగినను దండించుచు, నాత్మ శత్రువులనైన నదండ్యుల దండింపక ధర్మమార్గగతుం డగుచుఁ, దన యాజ్ఞాచక్రం బప్రతిహతం బగుచు, మానసాచలపర్యంతంబు వర్తింప సూర్యుండు నిజ కిరణంబులచేత నెంత పర్యంతంబు భూమిం బ్రకాశింపంజేయు నంత పర్యంతంబు నిజగుణంబులచేత లోకంబుల రంజిల్లం జేయు; నదియునుం గాక, ప్రకృతి రంజకంబులైన గుణంబులచేత దృఢవ్రతుండును, సత్య సంధుండును, బ్రహ్మణ్యుండును, సర్వభూత శరణ్యుండును, వృద్ధ సేవకుండును, మానప్రదుండును, దీనవత్సలుండును, బరవనితా మాతృభావనుండును, దన పత్ని నర్ధశరీరంబుగాఁ దలంచువాఁడును, నగుచుం బ్రజల యెడఁ దండ్రి వలెఁ బ్రీతి చేయుచు రక్షించుచుండు; మఱియును.

[4-457]

ఈయన మనసు సముద్రమంత గంభీరమైన లోతున్నది. సమీపంలో ఉన్నా దూరంగా ఉన్నట్టూ ఉండగలడు. వేనుడి శరీరంలోంచి అగ్ని పుట్టిన విధంగా అగ్నిలాగా (హుతాశను చందంబున) ఎవరూ ముట్టుకోలేనటివంటివాడు. అంటే ఎవర్ని ఎక్కడుంచాలో అక్కడ ఉంచగలడు. పరవనితలని తల్లులుగా భావించేవాడు. ఈ వచనంలో ఉన్న కొన్ని లక్షణాలు మన ప్రస్తుత పాలకులని ఉన్నా మన ప్రపంచం ఎంతో బాగుంటుంది కదా? మానభంగాలూ, అబ్బే నేను చేయలేదు అనే అబద్ధాలూ తగ్గుతాయి.

క. ఈ నృపతి ధరాచక్రము
ధేనువుగాఁ జేసి పిదుకు ధృతి నఖిల పదా
ర్థానీకము విబుధులు స
న్మానింపఁగఁ బ్రజకు జీవనప్రదుఁ డగుచున్. [4-461]

ఈ రాజు భూమిని ధేనువుగా చేసి ఆవిడనుండి కావాల్సిన వస్తువులన్నీ పితుకుతాడు. అలా ప్రజలకి కావాల్సినవాటిని ఇచ్చే జీవనదాత అవగలడు. అంటే అప్పటివరకు సస్యశ్యామలంగా ఉన్న రాజ్యంలో పంటలూ అవీ లేవు వేనుడి వల్ల ఆయన పట్టించుకోలేదు. భూమి బీడు అయిపోయింది. చేయాల్సిన పని భూమిని దున్నడం పంటలు పండించడం. అవి మొదలవగానే మిగతా ఉత్పత్తులు వాటికవే వస్తాయి బయటకి. పొలాలకి కావాల్సిన సామగ్రి, విత్తనాలు, రసాయనాలు, పశుసంపద, జనం కాస్త కడుపు నిండగానే వినోదం కోసం చేసే పనులూ, బట్టలూ వగైరా. చేయాల్సిందల్లా భూమిని దున్నడం, పంటలు పండించడం, అలా పండించేవారిని దగ్గిరుండి చూసుకోవడం.

చ. అమరవరేణ్యుఁ బోలి యనయంబు నితండును గోత్ర భేదన
త్వమునఁ జెలంగుఁ దా నజగవప్రదరాసన శింజినీ నినా
దమున విరోధిభూపతులు దల్లడ మంద నసహ్యసింహ వి
క్రమమున సంచరించు" నని కౌతుక మొప్పఁగఁ బల్కి వెండియున్. [4-462]

దేవతలని పోలినట్టా అజగవం అనే విల్లుతో విరోధులని నిరోధించలేని (అసహ్య సహించలేని) పరాక్రమంతో (సింహవిక్రమమున) జయించగలడు. ఈ పద్యంలో విల్లు అనే పదం ఎక్కడుందో చెప్పగలరా? అజగవప్రదరాశన (అజగవం అనే పేరుగల, ప్రదరము – బాణము, ఆసన – బాణానికి ఆశనము – విల్లు).

చ. "సకలజగన్నుతుం డితఁడు చారుయశోనిధి యశ్వమేధముల్
ప్రకటముగా శతంబు దగఁ బావనమైన సరస్వతీతటీ
నికటధరిత్రిఁ జేయుతఱి నేర్పున నంతిమ యాగమందుఁ గొం
డొక మఖసాధనాశ్వమును జంభవిరోధి హరించు నుద్ధతిన్. [4-464]

అంతా చేసాక ఈ యశోనిధి వంద అశ్వమేధాలు చేస్తాడు సరస్వతీ నదీ తీరంలో. ఆ నూరో యాగంలో గుఱ్ఱాన్ని ఇంద్రుడు ఎత్తుకుపోతాడు. ఇలా ఎందుకు జరుగుతుందనేది వామనావతారంలో చూసాం. నూరు అశ్వమేధాలు చేస్తే ఇంద్రపదవి వచ్చి తీరుతుంది. అందువల్ల ఇంద్రుడి సింహాసనానికి ముప్పు కదా? కానీ ఇక్కడ పృథువు ఆశ్వమేధం చేసేది ఇంద్రపదవి కోసం కాదు. పుట్టినవాడు లోకాలని ఉద్ధరించడానికి పుట్టిన నారాయణాంశ సంభూతుడు. మాయలో పడిన ఇంద్రుడు కూడా దీన్ని తెలుసుకోలేడు. నిజానికి పృథువు పుట్టినప్పుడు ఇంద్రుడే వచ్చి కిరీటం ఇచ్చాడు కదా? మాయ అంటే అదే.

ఇలా జరగబోయేది చెప్పాక కొంతకాలం గడిచింది. పంటలు పండని భూమిలో జనం తిండిలేక అల్లల్లాడుతున్నారు. నీళ్ళు కూడాలేవు. ప్రజలొచ్చి ఇలా చెప్పారు రాజుతో.

క. అరయఁగ నేము బుభుక్షా
పరిపీడం బడితి మయ్య! పై కొని తరు కో
టర జనిత వహ్నిచేతను
దరికొను వృక్షములుఁ బోలె ధరణీనాథా! [4-469]

క. శరణ శరణ్యుఁడ వగు నిను
శరణము వేఁడెదము; మాకు సత్కృప నన్నం
బరసి కృపచేసి ప్రోవుము
నరనాయక!" యనుచుఁ బ్రజలు నతులై పలుకన్. [4-470]

చెట్టు (తరు) తొఱ్ఱలో (కోటర) ఉన్న అగ్ని వాటిని దహించే విధంగా మేము ఆకలి (బుభుక్ష) చేత పీడింపబడుతున్నాం. నువ్వు రాజువు – [శరణ శరణ్యుడు – శరణు అనేవారికి శరణం ఇచ్చేవాడు] కనక ఏదో ఒకటి చేయాలి.

క. విని దానికి సదుపాయము
జననాయకుఁ డాత్మఁ దలఁచి సక్రోధుండై
ధనువున బాణముఁ దొడిగెను
ఘనరౌద్రుండైన త్రిపుర ఘస్మరు పగిదిన్. [4-471]

ఇదంతా విన్న పృథువు వింటికి బాణం ఎక్కుపెట్టాడు భూమ్మీదకి వదలడానికి. ఎలా ఎక్కుపెట్టాడో అసలు సిసలైన శివభక్తుడు మన పోతన చెప్తున్నాడు – త్రిపురాసులమీదకి శివుడు ఎక్కుపెట్టినట్టుగా.

క. మహిపతి నప్పుడు గనుఁగొని
మహి గోరూపమునఁ గంప్యమానయు నగుచున్
గుహకుం డగు లుబ్ధకుఁ గని
గహనంబునఁ బాఱు హరిణికైవడిఁ బాఱెన్. [4-473]

అలా తనమీదకి వచ్చే బాణాన్ని తప్పించుకోవడానికి భూమి (మహి) గోరూపంలో భయపడిపోతూ (కంప్యమానయగుచు – కంపించిపోతూ) లేడిలాగా – కుటిలచిత్తం (గుహకుండగు) కల లుబ్ధకు (వేటగాణ్ణి) చూసి అడవిలోకి పారిపోయే లేడిలాగా – పరుగెట్టింది. మొదట్లో చాలాకాలం పంటల్లేని భూమిలో విత్తనాలు జల్లితే ఏమౌతుంది? ఏమీ అవదు. మొదట భూమిని చదును చేయాలి. వర్షాలు పడాలి. బాగా దున్నాలి, వాతావరణం బాగుండాలి. అన్నీ కలిసాక మరో కొన్ని సంవత్సరాలకి జీవితాలు మెల్లగా మారతాయి. అంతేకానీ రాత్రికి రాత్రి ఏమీ జరగదు. ఇదే భూదేవి భయపడి పారిపోవడం ఏమీ చేయకపోవడం అంటే.

పృథువు గోరూపంలో ఉన్న భూదేవి వెంటబడ్డాక దాన్ని ఏంచేసాడు అనేది వచ్చే వ్యాసంలో.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS